క్లుప్తంగా

రేపు వాహనాల వేలం

హాలియా: హాలియా ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఒక మహీంద్రా జీపు, మూడు ద్విచక్ర వాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం పేర్కొన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ద్విచక్ర వాహనాలకు రూ.5వేలు, మహేంద్ర జీపునకు రూ.25వేలను గురువారం ఉదయం 10గంటల లోపు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో చెల్లించి రశీదు పొందాలన్నారు. అనంతరం అదే రోజు ఉదయం 11గంటలకు హాలియా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పేదలకు మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్ ఎం. రామానుజాచార్యులు సహకారంతో దాతలు టీకేఎల్ నరసింహాచార్యులు, చూడామణి ముందుకు వచ్చి పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ అధ్యక్షుడు అనంతరెడ్డి, రీజియన్ చైర్మన్ మాశెట్టి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, రాంబాబు, రామారావు, కోలా సైదులు, మాధవరెడ్డి, డాక్టర్ జాడీ రాజు, నీలా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ: సంక్రాంతి పండుగ సందర్భంగా మిర్యాలగూడ మండలంలోని వెంకటాద్రిపాలెంలో సీపీఐ పార్టీ అనుబంధ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దాసర్ల దుర్గమ్మ, ఎర్రబోతు పద్మ, ప్రమీల, శీలం సైదమ్మ, అంజన్న, రామలింగం, సింహాద్రి, పద్మ, భారతమ్మ, ఇందిరమ్మ, వెంకటమ్మ, అలివేలమ్మ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



వెంకన్నను సన్మానిస్తున్న ఫొటోగ్రాఫర్లు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపులో మంగళవారం మిర్యాలగూడ డివిజన్ ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా సిరిమల్లె వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా పందిరి లక్ష్మణ్, కోశాధికారిగా బంటు నాని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్లు ఎండీ యూసుఫ్, పి. వెంకన్న, గుగులోతు పాండునాయక్, వసంతాచారి, నాగార్జున, సైదా, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాదలాపురంలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ'



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ పాల్

మిర్యాలగూడ టౌన్: మండలంలోని బాదలాపురంలో మంగళవారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్, అసిస్టెంట్ డిపో మేనేజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి, ప్రధాన రోడ్డుకు అర కిలోమీటరు దూరం మాత్రమే ఉన్నందున కోదాడ–జడ్చర్ల రూట్లలో వెళ్లే ప్రతి బస్సును గ్రామానికి వచ్చే రోడ్డు వద్ద నిలపాలని స్థానికులు కోరారు. అనంతరం డీఎం పాల్ మాట్లాడుతూ.. ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమంలో వచ్చిన వినతులు, సలహాలను పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తామని తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక బస్ సర్వీసులు

మిర్యాలగూడ టౌన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నేటి నుంచి 14వ తేదీ వరకు డిపో నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్ సర్వీసులను నడపనున్నట్లు మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ డిపో నుంచి వయా నల్లగొండ మీదుగా హైదరాబాద్‌కు ప్రతి రోజు 10స్పెషల్ బస్సులను 20 టిప్పులను నడిపిస్తున్నామన్నారు. పండుగ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా బస్సు టికెట్ బుకింగ్ చేసుకునే వారికి 10శాతం రాయితీని కల్పిస్తున్నామన్నారు.

బెంబేలెత్తిస్తున్న వానర సైన్యం

- ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్తున్న కోతులు
- అడ్డుకుంటే దాడి చేసి గాయపరుస్తున్న వైనం
- బయటకు రావాలంటేనే జంకుతున్న జనం



డిండి మండల కేంద్రంలో రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న కోతులు

డిండి: మండల కేంద్రంలో రోజురోజుకు కోతుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వానర సైన్యం నిత్యం ఇళ్ల చుట్టూ సంచరిస్తూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఇంటి పైకప్పు, చెట్లు, ప్రహరీలపై రాత్రి, పగలు తేడా లేకుండా కోతులు సంచరిస్తున్నాయి. అవి ఆహారం కోసం ఇళ్లల్లోకి చొరబడి తినే వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. పెరట్లో చెట్లకు కాసిన కూరగాయలు, పండ్లను ధ్వంసం చేస్తున్నాయి. వాటిని అడ్డుకోబోయిన వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. కోతుల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఏడాది క్రితం గ్రామపంచాయతీలో ఫిర్యాదు చేయగా, కొన్నింటిని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదలేశారు. కానీ పూర్తిస్థాయిలో కోతులను పట్టుకోకపోవడంతో వాటి సంఖ్య పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కోతుల నుంచి రక్షణ కల్పించాలని మండల కేంద్రంలోని ప్రజలు కోరుతున్నారు.

దాడులు చేస్తున్నాయి



కోతులు నిత్యం ఇంటి చుట్టూ తిరుగుతూ ఆహారం కోసం ఇంటి లోపలికి వచ్చి తినే వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. అడ్డుకుంటే వెంటబడి మరీ గాయపరుస్తున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– కామాజి వెంకటమ్మ, డిండి

అడవులకు తరలిస్తాం



డిండి మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువగా ఉన్న మాట వాస్తవమే. ప్రజల ఫిర్యాదు మేరకు గతేడాది కొన్ని కోతులను పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించాం. అధికారులతో మాట్లాడి త్వరలోనే మిగిలిన కోతులను కూడా పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలిస్తాం.

– మేకల సాయయ్య, సర్పంచ్, డిండి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మిషన్ భగీరథ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట : గ్రామాల సర్వతోముఖాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం మన ఊరు – మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నేరెడుగొమ్ము మండలంలో పేర్వాల గ్రామంలో రూ.20లక్షలతో, ధర్మరేఖ్యతండాలో రూ.20లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే పేర్వాల గ్రామంలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న మిషన్ భగీరథ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ధర్మరేఖ్యతండాలో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మ, జెడ్పీటీసీ బాలునాయక్, ఎంపీటీసీ బిక్కునాయక్, సర్పంచ్‌లు లోకసాని తిరుపతయ్య, బషీర్, పల్స బాలమణి, తిరుపతయ్య, నాయకులు వెంకటయ్య, భరత్, లక్ష్మణ్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

మిర్యాలగూడ: వేములపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ పుట్టల సునీత అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దేవిక మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరుకావాలని అన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే కేసీఆర్ లక్ష్యం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



నాగార్జునసాగర్ : ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎంపీపీలు తదితరులు

పెద్దవూర: నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో గురుకులాలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ప్రభుత్వం అందించిన స్కూల్ బ్యాగులు, ట్రంక్ పెట్టెలు, షూను మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. గురుకులాల్లో చదువుకునే ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.1.25లక్షలు ఖర్చు చేస్తుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీతో పాటు ఎంపీపీ అనురాధాసుందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుమలగిరిసాగర్ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, సర్పంచ్ లింగయ్య, ఎంపీటీసీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

పెద్దవూర: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు, బసిరెడ్డిపల్లి, గర్నెకుంట గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అదే విధంగా బసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను అనురాధాసుందర్‌రెడ్డి, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గోన వివేకరావు, నాయకులు గోన విష్ణువర్ధన్‌రావు, కర్ణ బ్రహ్మారెడ్డి, కురాకుల అంతయ్య, సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు నరాల కొండయ్య, హాలియమ్మరామాంజి పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ : ఎమ్మెల్సీ

నాగార్జునసాగర్ : దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీలోని యూత్ హాస్టల్‌లో మహిళలకు నెహ్రూ యువ కేంద్రం నల్లగొండ వారి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, జీవననైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలపై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పెద్దవూర, తిరుమలగిరి(సాగర్) ఎంపీపీలు అనురాధ సుందర్‌రెడ్డి, భగవాన్‌నాయక్, కౌన్సిలర్లు ఇందిర, రమేశ్‌జీ, రామకృష్ణ, మంగ్తానాయక్, బీఆర్‌ఎస్ నాయకులు మోహన్‌నాయక్, ఆదాసు విక్రం, నిమ్మల కొండయ్య, జిల్లా యువ కేంద్రం అధికారి బి.ప్రవీణ్‌సింగ్, కేర్ టేకర్ శ్రీనివాసరెడ్డి, కొండా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 60మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.29.09లక్షల విలువైన చెక్కులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు వీరకోటిరెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, నాయకులు ఆంగోతు హాతిరాం నాయక్, ఎండీ యూసుఫ్, ధీరావత్ రవితేజ, ఇరుగు వెంకటయ్య, పోకల రాజు, వేములపల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జెర్రిపోతుల రాములుగౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్



పెద్దవూర కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భగత్

పెద్దవూర: పాఠశాల దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని లక్ష్యసాధన దిశగా కఠోర శ్రమ చేయాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, పాఠశాల పరిసరాలు, వంట గదిలోకి వెళ్లి వంటలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి మెనూ వివరాలు తెలుసుకున్నారు. కేజీబీవీకి మిషన్‌భగీరథ నీటిని అందించాలని అధికారులకు సూచించారు. తాజా కూరగాయలను వడ్డించాలని పేర్కొన్నారు. ప్రతి మండలంలో ఒక కేజీబీవీని ఏర్పాటు చేసి బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, నాయకులు జటావత్ రవినాయక్, వసుదేవుల సత్యనారాయణరెడ్డి, కర్ణ బ్రహ్మారెడ్డి, మునిరెడ్డి, మెండె సైదులు, రాజేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి వెంకటేష్

దేవరకొండ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సంఘం ఆధ్వర్యంలో పరిశీలించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజు, ఖాదర్, వినయ్, ఉత్తేజ్, రామకృష్ణ, రాహుల్ ఉన్నారు.

బహుజన సమాజాన్ని రక్షించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న బాబునాయక్

హాలియా : బహుజన సమాజాన్ని రక్షించడమే బహుజన వలంటీర్ ఫోర్స్ (బీవీఎఫ్) లక్ష్యమని ఆ సంఘం తెలంగాణ రాష్ట్ర కో–కన్వీనర్ సపావట్ బాబునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో జరిగిన బీవీఎఫ్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం బీవీఎఫ్ నియోజకవర్గ కన్వీనర్‌గా మహేష్, కో–కన్వీనర్‌గా రమావత్ మధునాయక్, పెద్దవూర మండల కన్వీనర్‌గా తుడుం మహేందర్, గుర్రంపోడు, త్రిపురారం మండలాల కన్వీనర్లుగా తరి నగేష్, ధనావత్ అశోక్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమళ్ల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీఎస్పీ నాగార్జునసాగర్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు బత్తుల ప్రసాద్, కొమ్ము రమేష్, జిల్లా మధు, కలకొండ వెంకటేష్, ముత్యాలు, ఉపాధ్యక్షులు ఆదిమల్ల సత్యం, ప్రభాకర్, శేఖర్, వినోద్ ఉన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి



దేవరకొండ : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ జాన్‌యాదవ్



మిర్యాలగూడ : మాట్లాడుతున్న డాక్టర్ సంజీవ

దేవరకొండ : ఈనెల 18నుంచి ప్రారంభం కానున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల పాటు కొనసాగనున్న కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శర్మ, తహసీల్దార్ రాజు, మండల వైద్యాధికారి విజయ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 18నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 2వ విడత కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాలరాజురెడ్డి కంటి వెలుగు కార్యక్రమంపై, అమలుతీరుపై అవగాహన కల్పించారు. మండల కేంద్రాల్లో, గ్రామపంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి కంటి వెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖారెడ్డి, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషారాణి, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కంటి వెలుగు 2వ విడత కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీపీ కొండూరు భవాని పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, ఎంపీడీఓ రాజు, డిప్యూటీ తహసీల్దార్ అర్షద్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ముచ్చర్ల యాదగిరి, జితేందర్‌రెడ్డి, బాల్‌సింగ్, ఎంపీటీసీలు వరలక్ష్మి ధనమ్మ, వైద్యాధికారులు శ్రీదేవి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

డిండి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామకార్యదర్శులకు ఏర్పాటు చేసిన కంటివెలుగుపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ గిరిబాబు మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమానికి సహకరించి ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ శ్రీనివాసాచారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : కంటి వెలుగు కార్యక్రమంపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని పాములపహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంజీవ అన్నారు. ఈనెల 18నుంచి గ్రామాల్లో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొననున్న సిబ్బందికి మంగళవారం మాడుగులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పోకల శ్రీవిద్య అధ్యక్షతన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దండా జితేందర్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కంటి వెలుగు'పై అవగాహన సదస్సు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై బుధవారం మండల కేంద్రంలోని శ్రీశ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఖాజా అస్గర్ అలీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఆరోగ్య శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని అన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.



డిండి : మాట్లాడుతున్న ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు



చింతపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొండూరు భవానీ



కొండమల్లేపల్లి : మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలరాజురెడ్డి

బాల్య వివాహాలు చేయడం నేరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి

పెద్దవూర: బాల్య వివాహాలు శిశు విక్రయాలు, భ్రూణ హత్యలు, ఆడపిల్లల అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, అమ్మాయిలకు 18ఏళ్లు, అబ్బాయిలకు 21ఏళ్లు నిండితేనే వివాహాలు చేయాలని ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో నిర్వహించిన 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్న పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1098కి, మహిళలపై గృహహింస, బలాత్కారం జరిగితే 181 నంబర్‌కి, ఏదైనా ప్రమాదంలో ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఏసీడీపీఓ సువర్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలాబాయి, పాఠశాల ఎస్‌ఓ జ్యోత్స్న, నాగలక్ష్మి, క్రాంతికుమారి, జ్యోతి, సరిత, అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, మంగమ్మ, అరుణ, రోజారాణి, సరిత, స్రవంతి, శిల్ప, ఎల్లమ్మ, రమాదేవి, శ్రీలత, ఇందిరా, సృజన పాల్గొన్నారు.

బాలల పరిరక్షణకు కృషి చేయాలి

చింతపల్లి : బాలల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కొండూరు భవానీ కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మండల బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్‌గా మంగళవారం ఎంపీపీ భవానీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయ రాదని, బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. బాలలకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్నా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, సీడీపీఓ లావణ్యకుమారి, ఎంపీడీఓ రాజు, సర్పంచ్ యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తహసీల్దార్‌కు వినతి

హాలియా : పదోతరగతి వార్షిక పరీక్ష పేపర్‌లో 30శాతం చాయిస్ ప్రశ్నలు పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెన్త్ వార్షిక పరీక్షల్లో వ్యాసరూప ప్రశ్నలు సెక్షన్ల వారిగా పెంచాలని, పరీక్షలను రోజు విడిచి రోజు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల తహసీల్దార్ మంగకు వినతిపత్రం అందజేశారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శిగా యాదగిరి

నిడమనూరు: మండలంలోని శాఖాపురం గ్రామానికి చెందిన నల్లగంతుల యాదగిరి బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం హైదరాబాద్‌లో యాదగిరికి ఉత్తర్వులు అందజేశారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

పెద్దఅడిశర్లపల్లి : క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని గుడిపల్లి ఎస్‌ఐ వీరబాబు అన్నారు. మంగళవారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మారమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో క్రీడా నిర్వాహకులు రమావత్ గోపి, రాగ్యానాయక్, అమరేందర్‌రెడ్డి, నెల్సన్, రమేష్, భిక్షం ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

అడవిదేవులపల్లి: తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందని ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని బంగారుగడ్డ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు –మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందించే ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు ఆదరించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎల్.వెంకన్న, అబ్బాస్ అలీ, శశిధర్‌రెడ్డి తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

డిండి: ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సురేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ అధ్యక్షుడు సురగి వినయ్ మట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్‌ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ రియాజ్, వెంకటేష్, రాహుల్, నరేంద్ర,చారి, రమేష్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను అవమానించడం సరికాదు

మిర్యాలగూడ టౌన్ : తమిళనాడు అసెంబ్లీ సమావేశంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి సామాజిక ఉద్యమకారులను అవమానించడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, మురళియాదవ్, జానపాటి రవి, రాములు, ఫారూఖ్ తదితరులున్నారు.

అల్పాహారం అందించడం అభినందనీయం

మిర్యాలగూడ: ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సహకారంతో పట్టణంలోని బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థినులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం అందిస్తుండటం అభినందనీయమని ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం ఉదయం విద్యార్థినులకు ఆయన అల్పాహారం అందించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రజిత, ఉపాధ్యాయులు గురులక్ష్మి, రఫీకున్నీసా, పద్మావతి, నిర్మల పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన బిల్డింగ్ పెయింటింగ్ కార్మికుడు జూకూరి సతీష్ ఇటీవల ఓ బిల్డింగ్‌కు పెయింటింగ్ వేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. మంగళవారం బిల్డింగ్ పెయిటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సతీష్‌కు తన నివాసంలో రూ.34వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సదరు బిల్డింగ్ యాజమానితో మాట్లాడి సతీష్ వైద్య ఖర్చులు కూడా భరించేలా ఒప్పించారని తెలిపారు. కార్యక్రమంలో మల్లు గౌతంరెడ్డి, బీఎం. నాయుడు, బంటు రామారావు, మంద రాజు, సైదులునాయక్, నాగుల్‌మీరా, పాశం గోవర్ధన్‌రెడ్డి, గౌస్, సురేందర్ తదితరులున్నారు.

విద్యుత్ ఏఈకి వినతి

చింతపల్లి : మండలంలోని రాజ్యానాయక్‌తండాలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలను తొలగించాలని కోరుతూ విద్యుత్ ఏఈ మురళీకృష్ణకు మంగళవారం బీజేపీ మండల నాయకులు వినతిపత్రం అందజేశారు. వారిలో రమేశ్‌యాదవ్ శేఖర్, మంగులాల్, వెంకటరమణ ఉన్నారు.